


# చౌక టికెట్ సరదా

## నాయని శేషాచలరావు, బి. ఏ.

"గోదావరిలో కలప కొట్టుకుని పోయినట్లు పోతున్నారందరు పదిరూపాయల టికెట్లమీద మనమూ పోదాము రా తిరుపతికి" అని అన్నాడు మోహనుడు.

"అంతా వెళ్తున్నారని వెళ్లడమేనా, అంత కన్న విశేష మేమన్నా వున్నదా" అని నేను అన్నాను.

"విశేషాలేమిటి, సశేషాలును. అంతా పోతున్నారు కాబట్టి మనమూ పోవడమే" అని అన్నాడతడు. ఒకరిని బట్టి యొకరు నడుచుట కలియుగాచారమై పోయినది. మా స్కూలు ఎస్. వి. పి. ని బట్టి (ఎస్. వి. పి. అంటే సీనియర్ వెర్నాక్యులర్ పండితుడు) నాకు పొడుము పీల్చడ మలవాటైనది. నను జూచి మోహానునకు రోజునకు ఆరుసారులు కాఫీ త్రాగడ మలవాటైనది. అవతలింటి ఇన్స్పెక్టరు భార్య భుజములు లేని జాకెట్ తొడుగు కొనుట జూచి, మా ఆవిడ నిన్న కూర్చుని తనకున్న జాకెట్లు కన్నింటికి చేతులు కత్తిరించేసింది. పట్నంనుంచి వచ్చిన డాక్టరు లచ్చయ్య గారి ఫ్రెంచికట్ మీసాలు జూచి, మావూరి బుంగ మీసాలన్ని కొంగముక్కు కత్తెరలకు జిక్కి-

ఒక్కరోజులో ఎలుక గొద్దె మీసాల క్రింద మారిపోయినవి. ఇటీవల గుళ్ళలో కానీ హరి కథలు, హోటళ్ళలో గ్రామఫోను పాటలు చెలరేగడం యీతత్వం వల్లనే. ఆనాడు కాళిదాసు 'శాకుంతలలో' శాకుంతలకు గ్రుచ్చుకున్న కాలిముల్లు యీనాడు 'సావిత్రి' టాకీలో మిస్. రామతిలకమునకు గ్రుచ్చుకున్నది. కాలికి గ్రుచ్చుకుంటేనేమి, వ్రేలికి గ్రుచ్చుకుంటేనేమి? మొత్తము మీద అన్ని అలవాటులు యీలాగే వొకరినుండి ఒకరికి గ్రుచ్చుకుంటవి. ఇంతకు తరువాత కథ ఏమంటారా, మావాడు కలకత్తా ఎం. ఏ. పరీక్షకని వందరూపాయలు యింట్లోనుంచి భుక్తం చేశాడు. అది మాయి దరకు పనికొస్తవని నేను రాత్రికి మెయిల్ ప్రయాణం స్థిరపరిచాను.

"స్టేషన్ మాస్టరుగారు, ఇప్పటికి ఎన్ని టికెట్లమ్మేశారు" అని నేను స్టేషన్ మాస్టరును అడిగాను, మేము స్టేషన్లోని కొచ్చి టికెట్లను కొంటూ వుండగా. "ఇప్పటికి వెయ్యి. ఇంకా వెయ్యికి డిమాండుంది" అని అత నన్నాడు. "సర్కసులో ఆఖరాటకు నేల అణా చేసి, మరుసటి రోజున టెంటు ఎత్తేస్తారు సర్కసు వారు. అట్లా అవదుకదా యీ రైల్వే కంపెనీ!" అని అన్నాడు మోహానుడు. "ఏవ్వూర్ సార్ మీది" అని అన్నాడు స్టేషన్మాస్టరు తీక్షణముగా మోహానుని చూస్తూ. "మాది యీవూరే. ఏలూరు. పదిరూపాయల టికెట్ మీద బండి ఎక్కను వచ్చాను. నీవు ఆలాగు రాలేదుకదా. సగే దానికేమి స్టేషన్ మాస్టరు బాబూ! ఈ ప్లాట్ఫారం మీది భజన సరుకంతా పది రూపాయల సరుకేనా! ఇందరూ బండి ఎక్కవలసినదే! ఇంతమందిని పరుపులోనికి దూది నెక్కించి నట్లు ఎక్కిస్తారన్న మాటేనా రైల్వే వాళ్లు!'' అని మోహాను డన్నాడు.

ఇంతలో బండి వచ్చిన గంట అయినది. రెండు ఇంజన్లతోటి పదహారు బండ్లతోటి, యిరవై అడుగుల మొసలి పెద్ద తలతోటి, ఎదిగిన పొట్టతోటి గోదావరినుండి జలజల యీది వొడ్డుకు చేరినట్లు, స్టేషన్కు జేరింది. దానిగోల దానిది. దిగే జనులు దిగలేక గోల. ఎక్కే జనులు ఎక్కలేక గోల. మొత్తముమీద అన్ని గోలలు ఏకమై సావిత్రీ టాకీలో యముని పద్యం గోలతోటి యమలోకం గోల ఏకీభవించినట్లు ఏకీభవించాయి. "ఏమిరా! మోహాను! ఏలాగు బండి ఎక్కడం'' అని నేను అన్నాను. "ఎక్కవోయి; ఈ ముసలమ్మను చూడు. ఆ వంగిన నడుము మీద పాదం వేసి అవతలకు గెంటు'' అని మోహాను డన్నాడు. "పాపం కదా'' అని నేను అన్నాను. "పదిరూపాయల బేరంలో అన్నీ కొట్టుకుని పోత''వని మోహాను డన్నాడు. "మొత్తముమీద అంతపని అవుతుందనుకున్నాను. ఆముసలిది తానూఎక్కదు, ఎక్కిస్తామన్నా వొప్పుకోదు. అంతలో స్టేషన్ మాస్టరొచ్చి ఆవిడ నడుమెత్తి బండిలోనికి పడేలాగున ఆవిడను మొగ్గ వేయించాడు. ఇంతలో గార్డు విజిల్ వేశాడు. ఇంజను గాడిద కూత కూసింది. బండిలోని జనులు "గోవిందా! తిరుపతి వెంకటేశ్వర స్వామికి గోవిందా!' అని గోలపెట్టారు. మా మోహానుడు బండి ఎక్కుతూ, "పదిరూపాయల టికెట్కు గోవిందా! రైల్వే కంపెనీకి గోవిందా!'' అని అందుకుని,

బండిలోని ప్రయాణీకులను హెచ్చరించాడు. బండి స్టేషన్ దాటింది.

"ఇదేమి బాబోయి! బ్రాహ్మణ అగ్రహారం వలె వున్న"దని మోహానుడన్నాడు. "బ్రాహ్మణ అగ్రహారం యిలా వుంటుందా" అని నేను మోహానుని అడిగాను. "కాకపోతే నమలి వుమిసిన యీ చెఱుకు పిప్పేమిటి? నలిగి జారిన యీ అరటిపండ్ల తొక్కలేమిటి? చూడ్డానికి అసహ్యమయే ఖిల్లీ కక్కులేమిటి? కాలు వేయుట కెక్కడా శుభ్రమైన స్థలము లేదే"అని అంటూ మోహానుడు కాలు ఎత్తి కాలు వేయ బోయి తూలి ప్రక్కనున్న ముసలమ్మపై కొరి గాడు. "నాయనోయి! నా నడుము పోయిందోయి!" అని ముసలిది కేక వేసింది. "వూరుకో అవ్వా! పదిరూపాయల టికెట్ల భారం అలాగు కనుపిస్తుంది." అని మోహానుడన్నాడు లేచి సర్దుకుంటూ. "పదిరూపాయల టికెట్ల ఫలం భగవంతుని కెఱుక! నన్ను కాస్త కూర్చోనివ్వండ్రా. నడుము విరిగి పోతూ వుంది." అని ఆ ముసలిది గోల పెట్టింది. "రా. అవ్వా. ఈ ప్రక్కన కూర్చో" అని శెట్టిగారొకరు నారింజ తొనను సగము నమలి చేరెడు వుమ్ముతో బల్ల క్రింద వూశాడు. "శెట్టిగారు! ఇది పదిరూపాయల పాకీ దొడ్డనుకున్నారా. అలా నమిలి క్రింద వూస్తున్నా"రన్నాడు మోహానుడు. "ఏ వూరు నీది బాబు!" అని శెట్టి తన పనిని తాను చేస్తునే వున్నాడు. "మాది తెల్లవారితే తిరుపతి" అని అన్నాడు మోహానుడు. "అందరిది అంతే" అని ఒక మహానుభావుడు కారా ఖిల్లీ నములుతూ నవ్వబోయి, పొలమారగా, చిచ్చుబుడ్డి చీరి మందు అందరిమీద బడ్డట్టు, అతని నోటిలో నలిగివున్న కారాఖిల్లీ చెదరి అందరి మీద పడ్డది. దానితో నా రంగుల సిల్కు షర్టునకు, మా మోహానుడి తెల్ల పంట్లాముకు మోక్షము వచ్చింది. అంతేకాకుండా, అతని నోటినుండి వెడలిన కారాఖిల్లీ సరకు కొంత ఎగిరి, ఫిరంగిగుండు గోడదాటి కందకంలో పడ్డట్టు, మధ్య నున్న బల్ల దాటి అవతల కాళ్ళు నిగడ దన్ని నిద్రపోతూవున్న ఆంగ్లో యిండియన్ దొర ముక్కుపై దబుక్కున పడింది. లేకపోతే మేమంతా చోటులేకుండా తన్నుకులాడుతు వుంటే, అతను ఎఫ్. ఎస్. టికెట్‌తో దర్జాగా పండుకోవడ మేమిటి? "బ్లడీ షీటు" (Bloody Sheet) అని ఆ మహానుభావుడు త్రాచుపామువలె ఆరడుగులు లేచేటప్పటికి, "సర్. సర్. అది బ్లడ్ (Blood) కాదు కారా ఖిల్లీ వు"మ్మని మోహానుడు అతనికి అడ్డం పడ్డాడు. "డామ్ నాన్ సెన్సు టెన్ రుపీ టిక్‌టక్" అని అతను జోడుతో బల్లను ఒక్క తాపు తన్నాడు. పూర్వకాలంలో విశ్వామిత్రుడు స్టేజిని గట్టిగా తంతే, స్టేజి బల్ల పటక్ అని విరగి వూరుకునేది. కాని మనవాడు జోడుతో బండి చెక్కను తన్నేటప్పటికి పాత జోడేమో అది, దాని మేకు అతని కాలిలోనికి దిగి వూరుకుంది. "సారీ, సిట్ డౌను" అని మన మోహానుడు అతనిని కూర్చోబెట్టి మేకును తీసి అతని ప్రక్క నిరికాడు. నేను పై బల్లపై కాళీ చూసుకొని ఒక్కమూల పండుకొన్నాను. మావాడు మాత్రం బండిలోని వారితో ప్రసంగము చేస్తూనే వున్నాడు.

"తిరుపతి ఎందుకు ప్రసిద్ధి" అని అడిగాడు మోహానుడు.

"క్షౌరమున"కని ఒకరు జవాబిచ్చారు.

"క్షౌరం చేయడానికా, చేయించుకోడానికా" అని మోహానుడు మళ్ళీ అడిగాడు.

"ముందు మనకు రైల్వేవాండ్రు పదిరూపాయలు క్షౌరం చేస్తే ఆ తరువాత దేవుడు తల క్షౌరం చేస్తా"రన్నాడు యింకొకడు.

"ఆ తరువాత ఏమవుతుం"దని మోహానుడడిగాడు.

"చెన్నపట్నం పోయామంటే అప్పు చేసి తెచ్చిన డబ్బు కాస్తా క్షవర మవుతుంది" అని యింకొకడు చెప్పాడు.

"అంటే మొత్తమ్మీద మన ప్రయాణం క్షౌరమున కన్నమాట. పదిరూపాయలిచ్చి క్షౌరానికి పోతున్నాము గోవిందా...గోవిందా.. ...గోవిందనామస్మరణ కాసేపు చెయ్యండి తెల్లవారి పోతుంది......పదిరూపాయల క్షౌరము రైల్వేవారు ముందే చేశారు గోవిందా... మద్రాసుకు పోతే పూర్తి క్షౌరమవుతుంది గోవిందా! గోవిందా!......తిరుపతిలో మనకు మంగలివాండ్ర అగత్యం అవసరములేదు. నా వద్ద అరడజను మంచి మంగలి కత్తులున్నాయి. మనలో మనమే చేసుకుందాము" అని మోహానుడన్నాడు.

మరునటి రోజున పదిగంటలకు తిరుపతి చేరుకున్నాము. మోహానుడు ఏభైమంది తిరుపతి యాత్రీకులను పోగుచేశాడు. మధ్యాహ్నము భోజనాలు తిరుపతి దిగువ కొండలో చేసుకొని, సాయంత్రము ఎగువ తిరుపతికి బయలుదేరాము. రాత్రి అయేటప్పటి కత్తులకు పదును మరొక్కసారి పట్టించాడు. తెల్లవారి నాలుగయేటప్పటికి, మోహానుడు అందరిని లేపి, మంగలివాండ్రు కానీకి గుండు చేస్తామన్నా వినక, "రైల్వేవాళ్లు చేసిన క్షౌరం చాలు. మిగత క్షౌరం మేమే చేసుకుంటామని అందరి బుఱ్ఱలు ఒక్కడే చెక్కేశాడు. అందరకు అయిన తరువాత నన్ను పిలచి "ఏమిరా నీవు చేసుకోవా!" అని అన్నాడు "నాకు క్షౌరమొద్దురా" అని నేను అన్నాను. "అయితే నాకు చెఱ్ఱ్య" అని మోహానుడు అన్నాడు...తరువాత అందరము కోనేరులో మూడు మునుగులు మునిగి, వెంకటేశ్వర స్వామికి గుండ్లు చూపడానికి గుడికి బయలు దేరాము. ముందు మోహానుడు తరువాత వరుసకు అయిదేసి చొప్పున పదివరసల గుండ్లు, వెనుక బాడీ గార్డులాగ నేను భుజాన్ని చేతి కఱ్ఱను వేసుకుని బయలుదేరాము. ముందు మోహానుడు పాడటం తరువాత దాన్ని మేమందుకోవడం.

"పదిరూపాయల టిక్కెట్ల మీద గోవిందా!
పడి మేము వచ్చాము గోవిందా!
గుండ్లయి వచ్చాము గోవిందా?
గుండ్లివిగో చూడండి గోవిందా!"

తరువాత మోహానుడు పదిరూపాయల గుండ్లను రెండు రోజులు తిరుపతిలో త్రిప్పాడు. రెండోరోజు సాయంత్రం రేణిగుంట మీదుగా మద్రాసు సెంట్రల్ స్టేషనుకు వారిని తీసుకుని వచ్చాడు. నన్ను ఏభై రిక్షాలను కుదుర్చుకుని రమ్మనమన్నాడు. వాటికి టోపులు ముడిచి వేయించాడు. ఒక్కొక్కరిని ఒక్కొక్క రిక్షాలో కూర్చోపెట్టాడు.

"పదిరూపాయల గుండ్లివి గోవిందా!
పట్నాని కొచ్చాయి గోవిందా!
చూడండి వీళ్ళను గోవిందా!
శుద్ధ ఛువరమయారు గోవిందా!"

తిరుపతి వెంకటేశ్వర స్వామికి గోవిందా! ఏడుకొండల వెంకటాచలపతికి గోవిందా! పది రూపాయల టిక్కెట్లురైల్వే కంపెనీకీ గోవిందా! టోపీలు వేసే మూరు మార్కెటుకు గోవిందా!" అని వాళ్ళని మూర్ మార్కెటు చుట్టూ త్రిప్పుతూ, యింతలో ట్రిప్లికేన్ బస్ అక్కడకు వస్తే అందులో మేము ఎక్కి వారికి తెలియకుండా మాయమయాము.


## ప్రకటన రేట్లు


| | | | |
|---|---|---|---|
| ఒకసారికి | 1 పుటకు | రూ. | 30—0—0 |
| ,, | ½ పుటకు | రూ. | 15—0—0 |
| ,, | ¼ పుటకు | రూ. | 7—8—0 |
| సం॥ చందా | | రూ. | 1—0—0 |
| విడి ప్రతి | | అణాలు | 0—2—0 |

వివరములకు :— "వినోదిని" కార్యాలయము,

234, గోవిందప్పనాయక్ వీధి, జి. టి., మద్రాసు.




ఉచితమైన బహుమానం యీ నెలమాత్రమే.



మా ప్రసిద్ధికెక్కిన మేలైన, మృదువుగా వ్రాసే "ఇరిడియో" ఫౌంటెన్ కలాన్ని ఒకదాన్ని రూ. 3-0-0 లకి కొంటే ఒక టేబిల్ టైంపీసు బహుమానంతోగూడా యిస్తాం.

ఉచితం:—రెండు కలాలు ఒకే సారి కొంటే ఒక లివర్ జేబు గడియారం బహుమతిగా యిస్తాం. 6 కలాలు కొంటే ఒక చేతిగడియారం ఉచితం. ఇవి నమ్మకమైనవి. 3 సం॥లు గ్యారంటీ గలవి. మీ పేరుగాని చేవ్రాలుగాని కలం మీద ఎలెక్ట్రిక్ మిషనువల్ల చెక్కబడ్తాయి.



ప్రతి కలానికి ఆర్డరిచ్చేటప్పుడు 1 రూపాయి ముందుగ అడ్వాన్సు పంపాలి.

ఫ్రెంచి పడకగది ఫోటోలు.

అనేక అందకత్తెలయొక్క ఫోటోలు అనేక రకాలుగా అనేక తరహాలుగా వున్నాయి. వీనిని పడకగదుల్లోను, బంగాళాలలోను, రాజగృహాల్లోను అలంకరిస్తే ఆకర్షవంతంగా కండ్లు మిరుమిట్లు గొల్పుతూంటాయి. వెల 1 డజను ఫోటోల సెట్టు రూ. 2.

విన్నర్ అండ్ కో., పార్కు టౌను, మద్రాసు.